

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సర్వేలో ప్రజలు భాగస్వాములు కావాలి

- అన్నివర్గాలకు సమన్యాయం కోసమే సమగ్ర కుటుంబ కులగణన సర్వే
- ఎన్యూమరేటర్లకు కాంగ్రెస్ శ్రేణులు అండగా నిలవాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలనే సమగ్ర కుటుంబ కులగణన సర్వే నిర్వహిస్తున్నామని, ఇందులో అన్నివర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలోని 3.7 లక్షల ఇళ్లకు వెళ్లి సర్వే చేసేందుకు 2,500 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఎన్యూమరేటర్లుగా పని చేస్తారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కులగణన చేసి బీసీ రిజర్వేషన్ల సంఖ్య పెంచుతామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చామని, ఆ హామీ అమలు కోసం ఫిబ్రవరి 4న కేబినెట్‌లో తీర్మానం చేశామన్నారు. ఫిబ్రవరి 15న తనకు అసెంబ్లీలో తీర్మానం పెట్టే అవకాశం లభించిందన్నారు. ప్రభుత్వం కులగణన కోసం 150 కోట్లు కేటాయించి, బీసీ కమిషన్‌ను నియమించి ప్లానింగ్ కమిషన్‌కు అప్పగించిందని మంత్రి తెలిపారు. సర్వే చేయనున్న ప్రభుత్వ అధికారులకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఇతర నాయకులు ఒక బృందంగా ఏర్పాడి సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ఇంటింటికి వెళ్లి సర్వేపై ప్రజలకు వివరించి, ప్రజల్లో ఏదైనా అసంతృప్తి ఉంటే వారి వద్ద నుంచి సమాచారం సేకరించి నివేదిక తయారు చేయాలన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత దేశవ్యాప్తంగా ఈ సర్వేను చేపడుతామని, కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ అమలు చేస్తున్నామని ప్రజలకు చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్‌ఎస్‌లో అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్, శాసన సభాపక్షనేత పదవులు అన్ని వారి కుటుంబ సభ్యులకే ఇచ్చారని, ఒక్క పదవి కూడా బీసీకి ఇచ్చిన పాపాన పోలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. రెండు లక్షలపై ఉన్న రుణాలను కూడా మాఫీ చేస్తామని తెలిపారు. అర్హులందరికీ పథకాలు ఇప్పించే బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తీసుకోవాలన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలంగాణకు ఒక్క రూపాయి తీసుకురాలేదని విమర్శించారు. తెలంగాణలో భారీ వర్షాలతో తీవ్ర నష్టం జరిగితే నష్ట పరిహారం ప్రతిపాదనలు పంపిస్తే భిక్షం వేసినట్లుగా చేశారని విమర్శించారు. జిల్లా మంత్రిగా మంచైనా.. చెడైనా తనదే బాధ్యతని, పనిచేసే ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానన్నారు. 10 ఏళ్లుగా విద్యార్థులకు

మిగతా 8వ పేజీలో... ..



సమావేశానికి హాజరైన కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు



ఉద్యోగులకు త్వరలో యోగా శిక్షణ

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాస్థాయి యోగా పోటీలు

◆ కరీంనగర్ స్పోర్ట్స్

6

బోధన్- కాగజ్‌నగర్ రైలు పునరుద్ధరణ

◆ కరీంనగర్ రూరల్

7



జంక్షన్ల నిర్వహణపై అసంతృప్తి



ఇందిరాచౌక్ జంక్షన్‌ను పరిశీలిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

- లైటింగ్, పౌంటేన్లు పని చేసేలా చూడండి
- 'సుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన జంక్షన్లను లక్షలాది రూపాయలతో సుందరీకరించారని, వాటి నిర్వహణను ఎందుకు పట్టించుకోవడం లేదని శాతవాహన అర్బన్ డెవలప్ మెంట్ అథార్టీ (సుడా) ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లపై తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఇందిరాచౌక్‌తోపాటు పలు జంక్షన్లను అధికారులతో కలిసి పరిశీలించారు. రెండేళ్ల వరకు జంక్షన్ల నిర్వహణ కాంట్రాక్టర్లదేనని, రెండేళ్ల పూర్తికాక ముందే నిర్వహణ బాధ్యత నుంచి ఎలా తప్పుకుంటారని ప్రశ్నించారు. బిల్లులు రావ లసి ఉందం టూ కాంట్రాక్టర్ చెప్పడంతో ఆ సమస్యను అధికారులు పరిష్కరిస్తారని, వెంటనే జంక్షన్లకు మరమ్మతులు చేసి లైటింగ్, ఫౌంటేన్లు పనిచేసేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ యాదగిరి, కాంగ్రెస్ నాయకులు గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్‌నాయక్, పెద్దిగారి తిరుపతి, కీర్తికుమార్, మాసూంఖాన్, అస్తపురం రమేశ్, మారుతీరావు పాల్గొన్నారు.

డీఈవో అక్రమాలపై విచారణ జరపాలి: డీటీఎఫ్

కరీంనగర్ టౌన్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవాల నరహరి, తూముల తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి రాజిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. డీఈవో అకారణంగా ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. గత జూన్‌లో బదిలీ ఉపాధ్యాయులు స్పౌస్‌కు దగ్గరగా వెళ్లలేదంటూ 17 మందికి షోకాజు నోటీసులు ఇచ్చి ఏడుగురిని సస్పెండ్ చేశారని విమర్శించారు. ఎస్సెస్సీ పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్‌లో ముగ్గురిని, వేసవి సెలవుల్లో ఇద్దరిని అకారణంగా సస్పెండ్ చేశారన్నారు. 317 జీవో అమలులో తన అనుయాయులైన కొందరు జూనియర్లకు జిల్లాను కేటాయించి లబ్ధి చేకూర్చి సీనియర్లను ఇతర జిల్లాలకు కేటాయించి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని ఫార్మాట్లతో మెస్సెజ్‌లు పంపిస్తూ ఉపాధ్యాయులను వేధిస్తున్నారని, పాఠశాల సందర్శన పేరిట సాయంత్రం నాలుగు గంటలకు వెళ్లి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను నిలబెడుతున్నారన్నారు. మహిళా ఉపాధ్యాయులని కూడా చూడకుండా సాయంత్రం 6.30 గంటల వరకు నిలబెట్టి విద్యారంగానికి సంబంధం లేని అంశాలను చర్చించి అనవసరమైన కారణాలతో మెమోలు జారీ చేస్తూ మానసికంగా వేధిస్తున్నారని వారు విమర్శించారు. ఈ అంశాలన్నింటిపై పాఠశాల విద్య డైరెక్టర్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

ఎన్‌వైకే ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్

గణేష్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో గణేష్‌నగర్ లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ గర్ల్స్ కళాశాలలో విజిలెన్స్ అవేర్ నెస్ వీక్ కార్యక్రమం నిర్వహించారు. అవినీతి లేని భారత దేశం అనే అంశంపై ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్ల్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం సరిత మాట్లాడుతూ పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుందన్నారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి ఎం వెంకట రాంబాబు మాట్లాడుతూ సమాజంలో అవినీతి దుష్ప్రభావాల గురించి యువతలో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరగుతుందన్నారు. కార్యక్రమంలో హజ్రా పర్వీన్, బి రవీందర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- రైసు మిల్లర్లు ఎలాంటి కోతలు విధించడానికి వీలు లేదు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని, ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేల కోట్ల రూపాయలను ఖర్చుచేసి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని, సన్నరకం వరి సాగును ప్రోత్సహించేందుకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ఇస్తోందని చెప్పారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నింటిని ప్రారంభించి, అవసరమైన ప్యాడీ క్లీనర్లు, ఇతర సామగ్రిని యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. దొడ్డు, సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేసి వేర్వేరుగా నిల్వ చేయాలని సూచించారు. రైసు మిల్లర్లు తాలు, తప్ప పేరిట ఎలాంటి కోతలను విధించవద్దని, రైతులకు ఎలాంటి నష్టం కలగడానికి వీలు లేదని మంత్రి ఆదేశించారు. ధాన్యం నాణ్యతపై విస్తృత ప్రచారం చేయాలని, ధాన్యాన్ని ఆరబెట్టుకొని కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. బ్యాంకు గ్యారంటీ ఇచ్చిన అండర్ టేకింగ్ రైసుమిల్లర్ల నుంచి తీసుకొని ధాన్యం కేటాయింపు చేయాలన్నారు. బ్యాంకు గ్యారంటీ సమర్పించకపోతే కొనుగోలు చేసిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు అవసరమైన మేరకు ఇంటర్మీడియట్ గోదాములను సన్నద్ధం చేయాలని, ప్రతి జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి ఫోన్ నంబర్‌ను రైతులకు ఇవ్వాలని సూచించారు. ధాన్యం అమ్ముకున్న రైతులకు 48 గంటల్లో నగదు చెల్లింపులు జరిగేలా చూడాలని, పొరుగు రాష్ట్రాల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాకుండా సరిహద్దుల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 27పై రైసుమిల్లర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, బ్యాంకు గ్యారంటీలపై సమాచారమిచ్చామన్నారు. జిల్లాలో అవసరమైన ఇం టర్మీడియట్ గోడౌన్లలో స్థలం ఉందని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాలో 340 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, 303 కేంద్రాలకు రైతులు 22,600 క్వింటాళ్ల ధాన్యం తీసుకొ చ్చారని, 28 కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఎం రజనీకాంత్, డీఎస్‌వో నర్సింగారావు, డీసీవో రామానుజాచారి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్‌పమేలా సత్పతి

జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్, లా కళాశాలలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్, లా కళాశాలలు ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాతవాహన యూనివర్సిటీకి అనుబంధంగా ప్రభుత్వ ఇంజనీరింగ్, లా కళాశాలు ఏర్పాటు చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత జిల్లాలో ఉన్న యూనివర్సిటీకి ప్రభుత్వ ఇంజనీరింగ్, లా కళాశాలలను మంజూరు చేసుకుని మిగతా వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, జిల్లా కార్య నిర్వహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, సతీష్, శ్రావణ్, పొన్నం శ్రీకాంత్ పాల్గొన్నారు.



మంకమ్మతోట వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

ఆలయాల్లో కార్తీక పూజలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శివ కేశవులకు ప్రీతికరమైన పరమ పవిత్ర కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా శనివారం నగరమంతటా ఆలయాల్లో, ఇళలలో సందడి నెలకొంది. శని వారం కావడంతో వేంకటేశ్వర, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు అభిషేక అర్చనల్లో పాల్గొన్నారు. శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. భక్తులు ఉన్న నదీ తీర ప్రాంతాల్లో పవిత్ర స్నానాలాచరించి ఆయా క్షేత్రాల్లో పూజలు నిర్వహించారు.



జ్యోతినగర్ వేంకటేశ్వరాలయంలో ..

అనర్హులకు పరిహారం చెల్లించొద్దు

చిగురుమామిడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లంపల్లి శివారులోని ప్రభుత్వ భూములు గతంలో అనర్హులకు ఇచ్చారని, వారికి పరిహారం చెల్లించకుండా చర్యలు తీసుకోవాలని గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ డిప్యూటీ స్పెషల్ కలెక్టరు కిరణ్‌ప్రకాశ్‌కు స్థానికులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఉల్లంపలి, కొండాపూర్, చిగురుమామిడి గ్రామాల్లో శనివారం గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ నోటిపికేషన్‌పై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉల్లంపల్లిలో పలువురు మాట్లాడుతూ తమ గ్రామంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని చెప్పారు. ఈ భూమిని గతంలో ఇతర గ్రామాలకు చెందిన అనర్హులకు కేటాయించారని చెప్పారు. అలా ఇచ్చిన భూములు వరద కాలువ నిర్మాణంలో పోతున్నాయని, వారికి పరిహారం చెల్లించొద్దని అధికారులను కోరారు. అనర్హులకు ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముద్దసాని రమేశ్, వరదకాలువ ఈఈ రాములు, స్పెషల్ నాయబ్ తహసీల్దార్ నిఖిలరెడ్డి, డీఈ ప్రశాంత్, ఆర్ఐ అరుణ్, మాజీ సర్పంచ్ కొమ్ము సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి మైలారం అంజలి, కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, సాయిలు, అజయ్, అలువాల శంకర్, లక్ష్మి, చీముర్తి ఎల్లయ్య పాల్గొన్నారు.

అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణం

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

సైదాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రం నుంచి గర్రెపల్లి గ్రామానికి రోడ్డు సక్రమంగా లేక ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సైదాపూర్-గర్రెపల్లి మధ్య వాగు ఉంటుంది. ఆ వాగు వర్షం కురిసినప్పుడు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలు నిలిచి పోతాయి. ఇటీవల ప్రభుత్వం సైదాపూర్-మొలంగూర్ రోడ్డు నుంచి గర్రెపల్లి ద్వారా సోమారం వరకు తారు రోడ్డు, వాగుపై బ్రిడ్జిని మంజూరు చేసింది. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ తారు రోడ్డు నిర్మించాడు. బ్రిడ్జి నిర్మాణాన్ని సగంలో వదిలేసి వెళ్లాడు. నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని, దీంతో తమకు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిడ్జీ వద్ద వాగు లోతుగా ఉండడంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. కార్లు మధ్యలో దిగబడుతున్నాయి. నెలల తరబడి కాంట్రాక్టర్ పనులు చేయకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి



గర్రెపల్లి బ్రిడ్జి వద్ద వాగులో నిలిచిపోయిన కారు

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు మణిదీప్ ఎంపిక


మణిదీప్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

మెట్‌పల్లి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి మణిదీప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జితేందర్ శనివారం తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి అండర్ 14 కరాటే పోటీలో మణిదీప్ ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడని తెలిపారు. అండర్-20 ఖోఖో పోటీల్లో కాశవేని దేవిశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

యువతిపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వివాహం చేసుకుంటానని చెప్పి మోసం చేయడంతోపాటు దాడి చేసి ఇబ్బందులకు గురిచేసిన ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వన్‌టౌన్ ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని గోదాంగడ్డకు చెం దిన రమేష్, ఒక యువతి సహజీవనం చేశారు. వారి మధ్య విభేదాలు రావడంతో విడిగా ఉంటున్నారు. ఇటీవల రమేష్ ఆ యువతితో గొడవ పడి దాడి చేశాడు. యువతి ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సేవా గుణం.. స్ఫూర్తిదాయకం

ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతూ స్ఫూర్తినిచ్చేవారు అరుదుగా కనిపిస్తారు. తమ ప్రాంతానికి సేవ చేస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చింతోజు భాస్కర్ మానేరు సంస్థల ద్వారా ఆ జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్ల ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి తమ ప్రాంతంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మోటారు మెకానిక్ నుంచి సేవా రంగంలోకి..

- మానేరు సంస్థ ద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చింతోజు భాస్కర్

సిరిసిల్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన చింతోజు భాస్కర్‌ను పేదరికం చిన్ననాడే పనివైపు పరుగులు పెట్టించింది. సిరిసిల్లలో మోటారు మెకానిక్‌గా గుర్తింపు తెచ్చుకున్న భాస్కర్ డీలర్‌గా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు.



అబ్దుల్ కలాం అవార్డును అందుకుంటున్న భాస్కర్


చింతోజు భాస్కర్

ఆర్థికంగా ఎదుగుతూ మరి కొందరికి ఉపాధి కల్పిస్తూనే స్వచ్ఛంద సేవలో తనదైన ముద్ర వేసుకున్నారు. మానేరు స్వచ్ఛంద సంస్థను స్థాపించి సేవా కార్యాక్రమాలను విస్తరించారు. జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. లాక్‌డౌన్ వంటి విపత్కర పరిస్థితుల్లో అన్నదానం, నిత్యావసర సరుకుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. సిరిసిల్లలో కార్మికుల వరుస ఆత్మహత్యల నివారణ కోసం మనోధైర్య శిబిరాలను నిర్వహించారు. పలు అవార్డులు, పురస్కారాలను పొందారు. లోక్ అదాలత్ సభ్యుడిగా, ప్రభుత్వ పరంగా పలు కమిటీల్లోనూ పని చేస్తున్నారు. సినీనటుడు సంపూర్ణేష్‌బాబుతో కలిసి కొబ్బరిమట్ట, బజారురౌడీ తదితర సినిమాల్లో నటించారు. పలు సినీ ప్రముఖులతో టీవీ షోల్లో పాల్గొన్నారు. న్యాయ సేవలను పొందడానికి ప్రజల్లో అవగాహనను పెంపొందించే దిశగా సినిమాను రూపొందిస్తున్నారు

పూర్వ విద్యార్థులు కలిసి.. ట్రస్ట్‌గా ఏర్పడి

- సేవలు అందిస్తున్న శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్

పెగడపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సేవ చేయాలనే గుణం ఉంటే లక్షాధికారులో, కోటీశ్వరులో కానక్కరలేదు.. మంచి మనసుండి చేయాలనే తపన ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు నంచర్ల శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు. పెగడపల్లి మండలంలోని నంచర్ల కేంద్రంగా నంచర్ల, రాములపల్లి, దీకొండ గ్రామాలకు చెందిన నంచర్ల పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 22 మంది కలిసి 2018లో శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. ముందుగా తమ గ్రామాల్లో సేవలు అందజేసి ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా విస్తరింపజేశారు. ఆపద సమయంలో ఆస్పత్రికి వెళ్లేందుకు ఆరు లక్షలు వెచ్చించి అంబులెన్స్ ఏర్పాటు చేశారు. దాత ఒకరు వైకుంఠరథం ఇస్తే ట్రస్ట్ తరుపున డ్రైవరు, డీజిల్ ఖర్చులు చెల్లిస్తున్నారు. మూడు గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి వార్తా పత్రికలతోపాటు యువతకు అవసరమయ్యే పుస్తకాల అందుబాటులో ఉంచుతున్నారు. ఇలా పలు సేవలు చేస్తున్నారు.


క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడి వైద్యానికి రూ. 75 వేలు ఆర్థిక సాయమందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అందరి సహకారంతో సేవా కార్యక్రమాలు

- చేపూరి మల్లేశ్‌గౌడ్, మేనేజింగ్ ట్రస్టీ



మాతృభూమికి కొంతైనా చేయాలన్న సంకల్పంతో శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించాం. ట్రస్టు సభ్యులే కాకుండా దాతలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకారంతో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మూడు గ్రామాలకే కాకుండా మండలం, చుట్టు పక్కల గ్రామాలకు కూడా ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అందిస్తున్నాం.

దాతల సహకారంతో మరిన్ని సేవలకు కృషి

- లింగంపల్లి లచ్చయ్య, కోశాధికారి



నంచర్ల పాఠశాలలో చదువుకున్న మేము పాఠశాలకు, గ్రామానికి ఏదైనా చేయాలనే సంకల్పంతో ట్రస్ట్ ప్రారంభించాం. విద్యా, వైద్యం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మరిన్ని సేవలు అందించాలనే దిశగా ముందుకు సాగుతున్నాం.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

భగత్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి విద్యార్థులు ఎంపికయ్యారు. వరంగల్ జిల్లాలో అక్టోబరు 28 నుంచి 30 వరకు జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17లో 81 కేజీల విభాగంలో బి అభిలాష్ రజత పతకం, అండర్-14లో 23 కేజీల విభాగంలో ఎం లహరి రజత పతకం కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎం పికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు వెంకటపద్మాదేవి, పీడీ ఎల్ వెంకటరమణ, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు అభినందించారు.

అంతర్‌జిల్లా స్థాయి చెస్ పోటీలకు ఎంపిక


ఎంపికైన 'ఆదర్శ' విద్యార్థులు

గొల్లపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ మినీ స్టేడియంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ పోటీల్లో గొల్లపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చారు. ఎస్‌జీఎఫ్ ఇంటర్నెట్ చెస్ పోటీల్లో జిల్లా స్థాయి పోటిల్లో ప్రతిభను కనబర్చి అంతర్‌జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదర్శ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న దేవి శ్రీహర్షిణి, ఎనిమిదవ తరగతి చదువుతున్న దేవి మహర్షి హశ్విత్ అనే ఇద్దరు విద్యార్థులు చెస్ పోటీల్లో జిల్లా స్థాయిలో మెరిసి అంతర్‌జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరు సొంత అక్కాతమ్ముడు కావడం విశేషం. అంతర్‌జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన అక్కాతమ్ముడిని ప్రిన్సిపాల్ సుంకరి రవి, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, పీడీ రజిత, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగులకు త్వరలో యోగా శిక్షణ

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఉత్సాహంగా జిల్లా స్థాయి యోగా పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యో తి): జిల్లాలోని ఉద్యోగస్తులకు ప్రత్యేకంగా యోగా శిక్షణను నూతన సంవత్సరం నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శనివారం జిల్లా యువజన, క్రీడాశాఖ, యోగా అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఆహ్వానిత యోగాసన పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ తనకు యోగా అంటే చాలా ఇష్టమన్నారు. అవకాశం ఉంటే క్రీడాకారిణి గా, కనీసం జట్టుకు మేనేజర్‌గానైనా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలని ఉందన్నారు. పాఠ శాలలు, ఇళ్లలో పిల్లలు కేవలం ధ్యానానికే పరిమి తం కాకూడదని, యోగాతో ప్రతిభను సొంతం చేసుకోవాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన యోగాసనాలు చూస్తే గర్వంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన దీపక్‌కు స్వర్ణ పతకం సాధించడం అభినందనీయమన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నవ్వడం కూడా యోగా లో ఒక భాగమని తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ కరోనా సమయంలో యోగా చేయడం వలన చాలామం ది ఆరోగ్యాన్ని పరిరక్షించుకున్నారని అన్నారు. జిల్లా యోగా అసోసియేష న్ అధ్యక్షుడు సర్దార్ రవీందర్‌సింగ్ మాట్లాడు తూ జిల్లాలో యోగా అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్వర్ణ పతక విజేత దీపక్‌ను, కోచ్ రామకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి సుధాకర్, జిల్లా క్రీడలు యువజన అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ కుమార్ నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ రాంబాబు, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎన్ సిద్ధారెడ్డి, తెలంగాణ జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి జనార్దన్‌రెడ్డి, తహసిల్దార్ కాళీచరణ్‌గౌడ్, జిల్లా ఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్య క్షుడు హర్మిందర్‌సింగ్, కోచ్‌లు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 300 మం ది క్రీడాకారులు వివిధ వయ స్సు విభాగాల్లో పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ఆహూతు లను ఆకట్టుకున్నా యి. అనంతరం విజేతలకు కలెక్టర్ జ్ఞాపికతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.



యోగాసన పోటీలను తిలకిస్తున్న కలెక్టర్, అతిథులు, యోగాసనం వేస్తున్న కలెక్టర్ తల్లి ప్రవమయి ఆచార్య


యోగాసనాలు వేస్తున్న బాలికలు

- యోగాసనాలు వేసిన కలెక్టర్ తల్లి

కలెక్టర్ మాతృమూర్తి ప్రవమయి ఆచార్య యోగాపై ఉన్న మక్కువతో పోటీలో పాల్గొని రజత పతకాన్ని సాధించింది. అనంతరం తన కూతురు, కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంది. ఇది తమ జీవితంలో మరపురాని ఘట్టమని వారు వ్యాఖ్యానించారు.

మంచు కురిసే వేళలో..


పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద పొగ మంచు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పొగమంచు దట్టంగా వ్యాపించింది. శనివారం తెల్లవారు జాము నుంచి ఉదయం ఏడు గంటల వరకు దట్టమైన పొగ మంచు ఆవరించింది. పాదాచారులు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఏమీ కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం చేశారు.

- పెద్దపల్లి/జగిత్యాల అర్బన్/వెల్గటూర్/ఎండప ల్లి/రుద్రంగి


జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో..


రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో..


జగిత్యాల పట్టణంలో

వివాహిత ఆత్మహత్య

ముత్తారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అమరాబాద్‌కు చెందిన బిస్కుల సమత(21)అనే వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు, ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాల్‌పల్లి జిల్లా మల్హర్‌రావు మండలం మల్లారం గ్రామానికి చెందిన సమత ముత్తారం మండలంలోని అమరాబాద్‌కు చెందిన బిస్కుల సంతోష్‌ను రెండు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. రెండేళ్లుగా సంతోష్ వరకట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తుండడంతో శుక్రవారం పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు మొదట కరీంనగర్‌కు, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. తన కూతురు మరణానికి అల్లుడు బిస్కుల సంతోష్ కారణమని మృతురాలి తల్లి చేద లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మృతురాలికి పది నెలల కొడుకు ఉన్నాడు.

మనస్తాపంతో యువకుడు..

ముత్తారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైదంబండ గ్రామానికి చెందిన బియ్యని అజయ్(24) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... అజయ్ ప్రేమించిన అమ్మాయికి వేరే పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలిసి మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు అజయ్ తండ్రి మొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

వరద కాలువలో దూకి వృద్ధురాలు..

కథలాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటపల్లికి చెందిన సుంకరి బుచ్చమ్మ (80) అనే వృద్ధురాలు వరద కాలువలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. బుచ్చమ్మ కొంతకాలంగా కడుపు నొప్పి, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన బుచ్చమ్మ మళ్లీ తిరిగి రాలేదు. సమీపంలో ఉన్న పెగ్గెర్ల వరద కాలువలో శనివారం శవమై కనిపించింది. కడుపునొప్పి తీవ్రం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని తెలిపారు. మృతురాలి మేనల్లుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

వీర్నపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో శనివారం బైక్ అదుపుతప్పి కింద పడడంతో గ్రామానికి చెందిన ఈసంపల్లి ఆశిష్ అనే యువకుడు గాయపడ్డాడు. ఆశిష్ తన స్నేహితులను కలిసేందుకు మండల కేంద్రానికి వెళ్తుండగా వడ్డెర కాలనీ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. దీంతో తలకు, వెన్నుపూస భాగంలో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

ముస్తాఫనగర్‌లో ఇల్లు దగ్ధం

గంభీరావుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లో శివంది రమేష్ ఇంట్లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇంటి నిర్మాణం కోసం అప్పుగా తెచ్చుకున్న లక్షా 20 వేలు నగదు కాలిపోయింది. బట్టలు, పత్రాలు, ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. ప్రమాద స్థలాన్ని రెవెన్యూ అధికారులు, పోలీస్‌లు పరిశీలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో వాహన తనిఖీల్లో శనివారం మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. పోలీసులు రెడ్డిపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఆటోను తనిఖీ చేయగా మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. రేషన్ బియ్యం తరలిస్తున్న మోటం గణేశ్, నంబయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని కిలోకు 12 రూపాయలు చెల్లిస్తూ కొనుగోలు చేసున్నారని పోలీసులు చెప్పారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని సుల్తానాబాద్ పరిధిలో ఉన్న కోళ్ల ఫాంలో అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారని ఎస్సై తోట తిరుపతి చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన కలప పట్టివేత


పట్టుకున్న కలపతో అధికారులు

చందుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన కలపను పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు సీసీఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు శనివారం తెలిపారు. మండలంలోని లింగంపేట గ్రామ శివారులోని పోలీస్ అమరవీరుల స్థూపం వెనుక భాగంలో టేకు కలపను డంపు చేసినట్లు సమాచారం అందిదన్నారు. అక్కడికి వెళ్లి పరిశీలించగా ఎనిమిది టేకు దుంగలు లభ్యం అయ్యామని, వాటిని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ విషయమై బీట్ ఆఫీసర్ బాలకృష్ణ మాట్లాడుతూ పట్టుకున్న కలపను ఎల్లారెడ్డికి తరలించనున్నట్లు తెలిపారు. కలప విలువ దాదాపు ఆరు వేల వరకు ఉంటుందని వివరించారు.

చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలిగా దీపారాణి



కోరుట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణానికి చెందిన జిల్లా దీపారాణి చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మహిళ విభాగం ఉపాధ్యక్షురాలిగా నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్ శనివారం ప్రకటించినట్లు పద్మశాలి సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా దీపారాణి మాట్లాడుతూ పద్మశాలి సంక్షేమానికి, చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకారం అందించిన రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్, పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, పట్ట ణ అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, సంఘ సభ్యులు వాసం భూమానందం, సంఘసభ్యులకు దీపారాణి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

హుజూరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాల బాలికల కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. బాలికల విభాగంలో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో సిరిసిల్ల జట్టు నిలిచింది. బాలుర విభాగంలో మొదటి స్థానం సిరిసిల్ల, ద్వితీయ స్థానంలో కరీంనగర్ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా వారికి బహు మతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎంఈవో శ్రీనివాస్, శ్రీనివాస్, హెచ్‌ఎం తిరుమల, వేణుమాధవ్, రాజేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాస్, రవికుమార్, అనిల్, సొల్లు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేష్‌నగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ సర్టిఫికెట్ కోర్సు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ ఒక ప్రటకనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నవంబరు 15వ తేదీ లోగా దరఖాస్తులు కళాశాల తెలుగు విభాగం కన్వీనర్ డాక్టర్ బుర్ర చంద్రశేఖర్‌గౌడ్‌కు సమర్పిం చాలని కోరారు.

బోధన్-సిర్‌పూర్ కాగజ్‌నగర్ రైలు పునరుద్ధరణ

కరీంనగర్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి కరీంనగర్ మీదుగా సిర్‌పూర్ కాగజ్‌నగర్ వరకు ప్రత్యేక రైలు ను శుక్రవారం నుంచి అధికారులు పునరుద్ధరించారు. గతంలో కరోనా సమయంలో రైలును నిలిపివేశారు. ప్రతి రోజు ఉదయం 4.15 గంటలకు బోధన్ నుంచి బయలుదేరి కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు 7.55 గంటలకు చేరు కుంటుంది. సిర్‌పూర్ కాగజ్‌నగర్‌కు 11.55 గంటలకు చేరుకుంటుంది. తిరిగి సిర్‌పూర్ కాగజ్‌నగర్ నుంచి బయలుదేరి కరీంనగర్‌కు మధ్యాహ్నం 2.35 గంటలకు చేరుకుంటుంది. బోధన్ రైల్వేస్టేషన్‌కు సాయంత్రం 6.15 గంటలకు చేరుకుంటుంది.

రాజన్నను దర్శించుకున్న టీఎస్‌సీపీసీఆర్ చైర్మన్

వేములవాడ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజే శ్వర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర స్టేట్ కమిషనర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (టీఎస్‌సీపీసీఆర్) చైర్మన్ శ్రీనివాస్‌రావు శనివారం దర్శించుకున్నారు. కు టుంబసభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు ఆశీర్వ దించగా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు ప్రసాదాన్ని అందజేశారు.


టీఎస్‌సీపీసీఆర్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఆలయ అధికారులు


వంకాయ తోటలో కలుపు తీస్తున్న మహిళలు


సాగులో ఉన్న దొండ తోట

కూరగాయల సాగులో అతివలు

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- స్వయంగా మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మకాలు

కూరగాయల సాగులో మహిళలు రాణిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేస్తూ అధిక దిగు బడులు సాధిస్తున్నారు. సేంద్రియ ఎరువులను తయా రు చేసుకుంటూ పంటలకు వాడుతున్నారు. పండిన కూరగాయాలను వారే మార్కెట్‌కు తరలించి అమ్ము తున్నారు. దీంతో దళారుల బెడద తగ్గింది. లాభ మైనా.. నష్టమైనా తామే భరిస్తున్నారు. సీజన్‌కు అను గుణంగా డిమాండ్ ఉన్న కూరగాయలు సాగు చేస్తున్నారు.


మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న కాలిఫ్లవర్

కోరుట్ల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలంలోని సర్పరాజ్‌పూర్, ఎఖీన్‌పూర్, అయిలాపూర్, నాగులపేట, వెంకటాపూర్ గ్రామాల


క్యాబేజీ తోటకు నీరు అందిస్తున్న మహిళా రైతు

మహిళలు అధిక మొత్తంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. అన్ని రకాల కూరగాయలు పండిస్తూ స్థానిక పట్టణాలకు తీసుకెళ్లి తామే విక్రయిస్తున్నారు. డిమాండ్‌కు, సీజన్ కు అనుగుణంగా వీరు కూరగా యలు, ఆకు కూరలు సాగు చేస్తారు. ప్రధానంగా కాలిఫ్లవర్, క్యాబేజీ, టమాట, తోటకూర, పాలకూర, చుక్కకూర, వంకాయ, దోస, గోరుచిక్కుడు తదితర పంటలను పండిస్తు న్నారు. కూరగాయలను రసాయన ఎరువులతో కాకుండా తాము తయారు చేసుకున్న ఎరువులు వేసి సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు. వీరు పండించిన పంటలను కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల వంటి పట్టణాలకు తరలించి మార్కెట్లలో విక్రయి స్తుంటారు. ప్రభుత్వం సహకరిస్తే మరింత సాగు చేస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదు. కూరగాయల విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు. పండించిన కూరగాయలను విక్రయిం చుకోవడానికి ఆయా పట్టణాల్లో తమకు ప్రత్యేక స్థలాలను కేటాయించాలని వారు కోరుతున్నారు.

దిగుబడులు బాగున్నాయి..

- తోట లక్ష్మి, మహిళా రైతు, సర్పరాజ్‌పూర్



మాకున్న 10 గుంటల వ్యవసాయ భూమిలో క్యాలిఫ్లవర్, క్యాబేజీ, తోటకూర సాగు చేస్తున్నాము. చేతికొచ్చిన కూరగాయలను స్థానిక పట్టణాల్లో విక్రయిస్తున్నాము. ప్రజలు కూడా తాజా కూరగాయలను కొనడానికి ఆసక్తి చూపుతున్నారు.

తాజా కూరగాయలకు గిరాకీ ఉంది..

జవిడి ప్రమీల, మహిళా రైతు, (నాగులపేట)



తాజా కూరగాయలకు మార్కెట్‌లో గిరాకీ బాగుంది. మేము ఏ రోజు తెంపిన కూరగాయలను ఆ రోజు మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముతాం. సేంద్రియ పద్ధతిలో పండిస్తుండడంతో ఆదరణ బాగుంది.


సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న మహిళా రైతు

● సేంద్రియ ఎరువుల తయారీ

గేదే, ఆవు, మేక పేడతోపాటు కుళ్లిపోయిన పండ్లు, కూరగాయలను సేకరించి సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నారు. అవసరం ఉన్న సమయంలో ఎరువులు వాడతారు. అవసరం ఉన్న సమయంలో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకుంటారు. కూరగాయలతోపాటు తోటల గట్లపై చామంతి, బంతి పూలు సాగు చేస్తారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే అభివృద్ధి

- ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆపై ప్రజా సేవకులం
- కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- మల్యాల-కాచారం రహదారి పనులను ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించిన బండి

మల్యాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధి సాధ్యపడుతుందని ఎన్నికల వరకే రాజకీయాలు చేస్తూ ఎన్నికల తరువాత ప్రజా సేవకులుగా అభివృద్ధికి ముందుకు వెళదామని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మల్యాల మండలం మల్యాల క్రాస్ రోడ్డు నుంచి మేడిపల్లి మండలం కాచారం వరకు 11.7కిమీ మేర కేంద్ర ప్రభుత్వ సీఆర్‌ఐఎఫ్ నిధులు రూ.25కోట్లతో చేపట్టిన డబుల్‌రోడ్డు విస్తరణ పనులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని కేంద్రం నిధులు ఇచ్చినా రాష్ట్రం, కేంద్రం కలిసి చేసుకోవల్సిన అభివృద్ధి అని ప్రస్తుతం ఇది కొనసాగిద్దామన్నారు. గత ప్రభుత్వ పాలనలో కేంద్ర ప్రభుత్వానికి సహకరించకుండా ప్రొటోకాల్ పాటించలేదని విమర్శించారు. కేంద్రం మంజూరు చేసిన నిధులను దారి మళ్లించడమే కాకుండా పేరు ప్రఖ్యాతల కోసం అధికారులపై ఒత్తిడి చేసిందన్నారు. చాలారోజుల తరువాత మల్యాలలో పార్టీల మధ్య ప్రొటోకాల్ పాటించడం కనిపించిందని ఇది మంచి సంప్రదాయమని కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు కలిసి అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని ఇక ముందు ఈ ఆనవాయితీని కొనసాగిద్దామన్నారు. కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణకు అందులోనూ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గానికి అత్యధికంగా సీఆర్‌ఐఎఫ్ నిధులు మంజూరు చేశారని సంజయ్ తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని ప్రస్తుత రహదారి పనుల ప్రారంభ విషయంలో ఎమ్మెల్యే సహకారం ఎంతగానో ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పరం సహకారం అవసరమని, గత రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి బండి సంజయ్ నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బొడిగే శోభ, సుద్దాల దేవయ్య, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు


గజమాలతో స్వాగతం పలుకుతున్న బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు

● కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం..

రహదారి విస్తరణ పనుల కోసం వచ్చిన బండి సంజయ్, మేడిపల్లి సత్యంకు బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. వేర్వేరు పార్టీలు అయినప్పటికీ పరస్పరం కలిసికట్టుగా మల్యాల క్రాస్ రోడ్డు నుంచి ప్రారంభ స్థలం వరకు పాదయాత్రగా రాగ ఆయా పార్టీల శ్రేణులు, ప్రజలు పూలు చల్లుతూ తీసుకువచ్చారు. ప్రొటోకాల్ ప్రకారం పెద్ద ఎత్తున రెండు పార్టీల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సంతోషం వ్యక్తం చేశారు. ఇక ముందు కూడా ఆలాగే ముందుకు వెళదామని పేర్కొన్నారు. రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కూడా కార్యక్రమానికి వస్తారని కాంగ్రెస్ నాయకులు పేర్కొనగా హాజరుకాలేదు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కార్యకర్తలతో చాయ్ తాగుతూ..ముచ్చటిస్తూ

కేంద్ర మంత్రి బండి సంజయ్ రహదారి పనుల శిలాఫలకం ఆవిష్కరణ తరువాత తనను కలవడానికి వచ్చిన కార్యకర్తలతో కొంత సేపు సరదాగా గడిపారు. అనంతరం కొండగట్టులో అల్పాహారం చేసి పార్టీ కార్యకర్తలతో కలిసి ముచ్చటిస్తూ టీ తాగారు. బండి సంజయ్‌ను కలవడానికి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలిరాగా ఆయన ముందుకు కదలలేని పరిస్థితి నెలకొన్నది. పోలీసులు వారందరినీ అక్కడి నుంచి పంపించే ప్రయత్నాలు చేశారు. దీంతో బీజేపీ నాయకులు కొందరు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుడిని కలవనీయరా.. సమస్యలు చెప్పుకో నియ్యరా అంటూ మండిపడ్డారు.

● కాగా రహదారి పనుల ప్రారంభానికి ఏర్పాటు చేసిన శిలాఫలకంలో నూకపల్లికి బదులు మల్యాల గ్రామంగా పేర్కొనడంతో నూకపల్లి వాసులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరు మార్చాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


బంజేరులో కంపోస్ట్ షెడ్డుని పరిశీలిస్తున్న నేషనల్ టీం సభ్యులు

వీర్నపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలంద రూ సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం లీడర్ ఎస్పీ సునీల్‌కుమార్, సభ్యులు స్నేహ నజీబ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు బంజేరులో ఉపాధిహామీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, నేషనల్ సోషల్ అసిస్టెంట్ ప్రోగ్రాం, నేషనల్ రూరల్ లైవ్ లీ వుడ్ కార్యక్రమానికి సంబంధించిన పనులను శనివారం పరిశీలించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేస్తున్న పనుల పనితీరు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు.

వీర్నపల్లి మండలం బంజేరులో గ్రామపంచా యతీ రికార్డుల మెయింటెనెన్స్, అభివృద్ధి పనుల్లో పంచాయతీ కార్యదర్శి రణధీర్ పనితీరు బాగుందన్నారు. అంతకుముందు గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణ లో మొక్కలు నాటారు. కార్యక్రమం లో ఏపీడీ నర్సింహులు, సాంకేతిక సలహాదారులు అర్షద్ పాషా, ఎంపీడీవో రఘురాం, ఏపీవో శ్రీహరి, టెక్నికల్ అసిస్టెంట్ అనిత, గంగాధర్, ఐకేపీ డీపీఎం పద్మయ్య, ఏపీఎం నర్సయ్య, సీసీలు శ్యామల, రాధ పంచాయతీ కార్యదర్శులు రణధీర్, తిరుపతి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు అధికారిపై కుక్క దాడి

వేములవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, కులగణన సర్వే విధుల్లో ఉన్న వార్డు అధికారిపై కుక్క దాడి చేసిన ఘటన శనివారం నాడు వేములవాడ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక రామ్ మందిర్ వీధిలోని ఓ ఇంటికి సర్వే కోసం వెళ్లిన మున్సిపల్ వార్డు అధికారి ఆంజనే యులుపై అక్కడున్న కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో కాలుకు గాయమైన అంజనేయులును ఏరియా ఆసుపత్రి తరలించి చికిత్స అందించారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

వీర్నపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో లచ్చయ్య శనివారం తెలిపారు. వీర్నపల్లి మండలం జవహర్ లాల్ నాయక్ తండాకు చెందిన అజ్మీరా తరుణ్ అనే యువకుడు వరికోత మిషన్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అజ్మీరా సాగర్‌తో పలు విషయాల్లో గతం నుంచి తరుణ్‌కు విభేదాలు ఉన్నాయి. దానిని దృష్టిలో ఉంచుకొని సాగర్ అతడి స్నేహితులు దేవేందర్, రవి, శ్రీహరి వరికోత మిషన్ నడుపుతున్న తరుణ్‌ను మిషన్‌పై నుంచి దించి తీవ్రంగా గాయపర్చారు. గాయప డిన తరుణ్‌ను స్థానికులు ఆసుపత్రికి తర లించారు. బాధితుడు తరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమో దు చేసి దర్యాప్తు జరుపుతున్నట్ట నట్లు ఎస్‌హెచ్‌వో లచ్చయ్య తెలిపారు.

వైభవంగా కార్తీక మాసోత్సవాలు ప్రారంభం


నదిలో దీపాలు వదులుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్


స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


రాజన్న ఆలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

గోదావరి నది వద్ద గంగా హారతి

ధర్మపురి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. కార్తీక మాసం పురస్కరించుకుని ఉదయం నుంచే భక్తులు క్షేత్రానికి చేరుకున్నారు. ఏటా నిర్వహించే విధంగా ధర్మపురి గోదావరి నది వద్ద సాయంత్రం గంగా హారతి ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆరంభం నుంచి 15 రోజుల పాటు జరిగే కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు సిబ్బంది ఊరేగింపుగా గోదావరి నదికి వెళ్లారు. అనంతరం నది వద్ద శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి వరకు గంగా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 15 రోజుల పాటు పౌర్ణమి వరకు నిత్యం సాయంత్రం వేళలో నిర్వహిస్తారు. గంగా హారతి కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. కా ర్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు సీహెచ్ రమణాచార్యా, నంబి నరసింహమూర్తి పాల్గొన్నారు.

● భక్తుల రద్దీ..

ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం వరకు క్షేత్రానికి వే లాది మంది భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. అనేక మంది మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించారు. రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు అంజనేయ స్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్యఅర్చకులు నిత్యపూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ నేతృ త్వంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

కొండగట్టులో కార్తీక దీపారాధన

మల్యాల (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో కార్తీకమాసం పురస్కరించుకొని దీపారాధన నిర్వహించారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి అభిషేక మండపంలో దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా డోలు వాయిద్యకారుడు నీలకంఠం స్వామి వారి భజన చేశారు. ఈవో రామకృష్ణరావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, ఆలయ అర్చకులు, వేదపాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు

● వేములవాడలో ఆకట్టుకున్న కార్తీక దీపోత్సవం

వేములవాడ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): ఆదిదంపతులకు ఎంతో ప్రీతికరమైన కార్తీకమాసంను పురష్కరించుకుని వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో వెలిగించిన కార్తీకదీపోత్సవం నేత్రపర్వంగా ఆకట్టుకుంది. కార్తీకమాసం మొదటి రోజు కావడంతో ఆలయంలో ఈవో వినోద్‌రెడ్డి కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన భక్తులు ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవం కార్యక్రమాల్లో పాల్గొని ఆధ్యాత్మికత ఉట్టిపడేలా దీపాలను వెలిగించారు. ఓం, ఓం నమఃశివాయ, స్వస్తిక్ రూపాల్లో భక్తులు వెలిగించిన దీపాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శనివారం ఉదయం నుంచే భక్తులు రాజన్న ఆలయంలో కార్తీక దీపాలను వెలిగించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో రాజన్న ఆలయ ప్రాంగాణం దీపాలకాంతుల్లో దేదిప్యమానంగా వెలుగొందింది.


కొండగట్టులో..

● ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో అర్చకులు వేదమంత్రాలతో వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గండదీ పంలో ఆకాశదీపాన్ని ఆలయ అర్చకులు వెలిగించారు. కార్యక్ర మంలో ఆలయ ప్రధాన అర్చకులు నమిలికొండ రాజేశ్వర శర్మ, ఆలయ అర్చకులు, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు ఉన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో యోగాచార్య సంపత్‌కుమార్ రచించిన 'యోగా ఫర్ ఉమెన్' పుస్తకావిష్కరణ ఉంటుందని అధ్యక్ష కార్యదర్శులు కొత్త అనిల్‌కుమార్, దొమ్మాటి శంకర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా సినారె రాష్ట్ర స్థాయి పురస్కార ప్రదాత పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఎడవెల్లి విజయేంద్రరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు పాటల పోటీలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన గాయని, సల్వాజీ మ్యూజిక్ గ్రూప్, ఈవెంట్స్ ఆర్గనైజేషన్ కన్వీనర్‌గా ఉన్న సల్వాజి సంధ్య ఆదివారం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు ప్రయత్నం చేయనుంది. కలెక్టరేట్ ఆడిటో రియం వేదికగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏకధాటిగా ఆరు గంటల పాటు లైవ్ మ్యూజిక్ షోలో సంధ్య పాడనున్నారు. సంగీతాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని సల్వాజీ మ్యూజిక్ గ్రూప్, ఈవెంట్స్ ఆర్గనైజేషన్ వ్యవవస్థాపక చైర్మన్ సల్వాజి ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు.

'కురుమ కులస్తులకు న్యాయం చేయాలి'

భగత్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కురుమలకు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని బీసీ కమిషన్ చైర్మన్‌కు కురుమ సంఘం జిల్లా ప్రధాన కడారి అయిలన్న కురుమ వినతిపత్రం అందించారు. కరీంనగర్‌లో బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌ను నాలుగు జిల్లాల కలెక్టర్ల సమక్షంలో బీసీ కులాల అవగాహన సదస్సులో కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎలుకపెల్లి లచ్చన్న, చిగుళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో పారమిత విద్యార్థి ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించ నున్న అండర్-17 రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలకు పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థి ఎస్ జైదీప్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతనిని పారమిత పాఠశాలల చైర్మెన్ డాక్టర్ ఇ ప్రసాద్‌రావు అభినందించారు.

'సీఎంఆర్ఎఫ్ కుంభకోణంపై సీపీకి ఫిర్యాదు చేస్తా'


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

కరీంనగర్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ కుంభకోణంపై సీపీకి ఫిర్యాదు చేస్తానని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శనివారం కరీం నగర్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకొని అభివృద్ధిపై దృష్టిపెట్టాలని హితవు పలికారు. భూపాలపల్లిలోని సురక్షా హాస్పిటల్ నుంచి బిల్లులు తెచ్చి ఇక్కడ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు తీసుకుంటున్నారని రసమయి ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గెలిచి 10 నెలలు అవుతున్నా గన్నేరువరంకు డబుల్ రోడ్ ఎందుకు పూర్తి చేయలేదన్నారు. మానకొండూర్, ఇల్లంతకుంటలకు మంజూరు చేసిన 50 పడకల ఆసుపత్రులను ప్రారంభించాలని రసమయి ఈసందర్భంగా డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో రోడ్లు, కాలువల పనులను పూర్తి చేయించాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి చేస్తే క్యాంపు కార్యాలయంపై ప్రతిదాడికి పూనుకుంటామని రసమయి హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మానకొండూర్ నియోజకవర్గ మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేను అంగన్‌వాడీ టీచర్లకు అప్పగించాలి

గణేష్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుల గణన సర్వేను అంగన్‌వాడీ టీచర్లకు అప్పగించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టేకుమల్ల సమ్మయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే చేయడం హర్షించదగిన విషయమన్నారు. సర్వే చేయడానికి అంగన్‌వాడీ టీచర్లకు ట్రైనింగ్ ఇచ్చి పది వేలు వేతనం ఇస్తామని ఆదేశాలు జారీ చేశారన్నారు. కానీ ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సర్వే చేస్తారని ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవడం సరి కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి కుల గణన సర్వేలో విధులు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు అప్పగించాలని టేకుమల్ల సమ్మయ్య కోరారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు అవకాశం కల్పించాలి'

సుభాష్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రానున్న శాసనమండలి ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు అవకాశం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువత బీసీలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ తన జీతం నుంచి 30 శాతం నిరుద్యోగుల కోసం ఖర్చు చేస్తున్నారని తెలిపారు. అవసరమైన వారికి కోచింగ్ ఇప్పిస్తున్నాడని ఇలాంటి వారిని చట్ట సభలకు పంపిస్తే విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ కమిషన్‌కు చట్టబద్ధత లేదని, హైకోర్టు తీర్పుకు అనుగుణంగా డెడికేట్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తంగళ్ళపల్లి రాజ్‌కుమార్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి దుబ్బాసి ప్రణీత్, పంజాల శివాజీ, సోషల్ మీడియా ఇంచార్జీ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే ప్రభుత్వ ఉపాధ్యాయులకు అప్పగింత

కరీంనగర్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుల గణన సర్వేను ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్లు)లకు ప్రభుత్వం అప్పగించింది. సర్వే శనివారం ప్రారంభం కావల్సి ఉండగా ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు నిలిపివేశారు. తిరిగి ఈనెల 8నుంచి సర్వే జరుగుతుందని మండల అధికారులు తెలిపారు. కరీంనగర్ మండలంలో మొత్తం 17 గ్రామ పంచాయతీలు ఉండగా మొత్తం 12,110 కుటుంబాలు ఉన్నాయి. మొత్తం 56మందికి మండలంలో 41మంది ఉపాధ్యాయులే ఉన్నారు.

'నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తా'

సుభాష్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్య నిర్మూలనకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ బీఎస్ రావు అన్నారు. శనివారం నగరంలోని మైత్రీ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని సహజ వనరులు, సారవంతమైన భూమి, నీరు, ఖనిజ సంపద మన దేశంలో ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి తాను పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌సుందర్, రాష్ట్ర ఎలెక్ట్ అధ్యక్షుడు డాక్టర్ పి కిషన్, కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, తానా అధ్యక్షుడు డాక్టర్ అరుణ్‌కతారి, డాక్టర్ విజయ్‌మోహన్‌రెడ్డి, పెన్షనర్స్ అధ్యక్షుడు పెండ్యాల కేశవరెడ్డి పాల్గొన్నారు.

నియామకం

సుభాష్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షునిగా బిజిలి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా బిజిలి శ్యామ్‌ను నియమిస్తూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మానుపాటి రవి, ప్రధాన కార్యదర్శి బిజిలి శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. తమ నియామకానికి సహకరించిన వారందరికి శ్రీనివాస్, శ్యామ్ కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారుడికి సన్మానం

సుభాష్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ చాంపియన్ షిప్‌లో మెడల్ సాధించిన మొగిలి వినయ్‌ను తెలంగాణ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. శనివారం స్థానిక కోతిరాంపూర్‌కు చెందిన మొగిలి వినయ్ సౌత్‌జోన్ చాంపియన్ షిప్ స్టిపుల్‌చేజ్‌లో మొదటి స్థానంలో గెలిచి మెడల్ సాధించాడు. వినయ్‌ని సన్మానించిన అనంతరం తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి మాట్లాడుతూ వినయ్‌కి తెలంగాణ ఎరుకల ప్రజాసమితి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉండాడి అంజయ్య, జిల్లా అధ్యక్షుడు లోకిని పోచయ్య, మొగిలి శేఖర్, బిజిలి సమ్మిలు, ఉండాడి వెంకటేష్, నడిగడ్డ కుమారస్వామి, ఉండాడి సాగర్, పాల్గొన్నారు.

సర్వేలో ప్రజలు భాగస్వాములు కావాలి

(5వ పేజీ తరువాయి)

మెస్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచలేదని, ఇప్పుడు చార్జీలు పెంచి, నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. గురుకులాల అద్దె 50 శాతం చెల్లించామన్నారు. ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకే కులగణన సర్వే చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కరీంనగర్, హుజురాబాద్ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పురుమల్ల శ్రీనివాస్, వొడితెల ప్రణవ్‌బాబు, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, వైద్యుల అంజన్‌కుమార్, సమద్ నవాబ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన శాతవాహన వైస్ ఛాన్స్‌లర్


సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వీసీ

కరీంనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డిని శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి తనకు వైస్ ఛాన్స్‌లర్‌గా అవకాశం కల్పించినందుకు ఉమేష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

'కరీంనగర్ అభివృద్ధికి వినోద్‌కుమార్ చేసింది శూన్యం'

భగత్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌చేసిందేమి లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. బీఆర్ఎస్ లీడర్లు తిట్ల పురాణాలకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారారన్నారు. రాజకీయ నిరుద్యోగిగా ఉన్న వినోద్‌కుమార్ అనవసర అంశాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తు మీడియాలో స్పేస్ కోసం పాకులాడుతున్నారన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక వినోద్ కుమార్ పనికిమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.

గంగుల లక్ష్మీనర్సమ్మకు పలువురి నివాళి


లక్ష్మీనర్సమ్మకు నివాళులర్పిస్తున్న గంగుల కుటుంబసభ్యులు, బంధువులు

కరీంనగర్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాతృమూర్తి గంగుల లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ చైర్మన్లు, పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన గంగుల లక్ష్మీనర్సమ్మ దశదిన కర్మకాండ కార్యక్రమానికి నాయకులు హాజరై గంగుల కుటుంబసభ్యులను పరామర్శించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కుటుంబసభ్యులు పాల్గొన్నారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కల్వకుంట సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, రాజేశంగౌడ్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, పుట్ట మధు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ చైర్మన్లు బాజిరెడ్డి గోవర్ధన్, కొండూరి రవీందర్‌రావు, సర్దార్ రవీందర్‌సింగ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్, కోటి కిశోర్‌గౌడ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు నివాళులర్పించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

సుభాష్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. నగరంలోని సప్తగిరి కాలనీ, కేజీబీవీ, దస్గర్‌వాడీ, మంకమ్మతోటలోని ప్రభుత్వం బాలికల పాఠశాల్లలోని 173 మంది విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చేతులమీదుగా అందచేశారు.

నిరుపయోగంగా కంపోస్టు షెడ్లు

-రోడ్డుపై పేరుకుపోయిన చెత్త
-పట్టించుకోని అధికారులు


దుబ్బపల్లిలో వృథాగా కంపోస్టు షెడ్డు

కరీంనగర్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో తడి, చెత్త పొడి చెత్త వేర్వేరుగా సేకరించి సేంద్రియ ఎరువుగా వాడుకునేందుకు ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లు వృథాగా మారుతున్నాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లలో చెత్త వేయకుండా రోడ్ల పక్కనే పడేస్తున్నారు. కరీంనగర్ మండలం దుబ్బపల్లి గ్రామంలో కంపోస్టు షెడ్‌ను నిర్మించగా వాటిని ఉపయోగించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో 2.5 లక్షల రూపాయలు వెచ్చించి వైకుంఠధామం పక్కనే నిర్మించారు. గ్రామంలో సేకరించిన చెత్తను కంపోస్టు షెడ్డులో సేకరించాల్సి ఉండగా పక్కనే రోడ్డుపై చెత్తను పడేసి అక్కడే కాల్చేస్తున్నారు. దీంతో దుర్వాసనతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుల్లో వేసేలా చూడాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాంపూర్ గిద్దెపెరుమాళ్ళ ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు పురాణం మహేశ్వరశర్మ వైదిక నిర్వహణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో అర్చకుడు రామక శంకరశర్మ, ఈవో ఎంపెల్లి మారుతి, ధ్వజస్తంభ దాత, 32వ డివిజన్ కార్పొరేటర్ మర్రి భావనా సతీశ్ పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 11.45 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శిక్షణ

కరీంనగర్‌స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో పది రోజులపాటు నిర్వహించిన జాతీయ సాహస శిక్షణ శిబిరం ముగిసింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని పలు సాహసోపేత పర్వతాలను అధిరోహించిన శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బృందం శనివారం ఢిల్లీ చేరుకుంది. శాతవాహన ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మనోహర్ నేతృత్వంలో వారు సోమవారం కరీంనగర్‌లో ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్‌ను కలవనున్నారు. బృందంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మలావత్ అనిల్‌కుమార్, వై కుశాల్, ఎంజల రాజు, వేణుమాదవ్, తులసీదాస్, సరిత, సంధ్య, ఆకుల అనుష, సుప్రియ, హర్షితలు ఉన్నారు.

అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ

- పారిశుధ్య పనులపై పట్టింపు కరువు

గన్నేరువరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో గ్రామాల్లోని ప్రజలు రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పారిశుధ్యం పనులు కూడా సిబ్బంది పట్టించుకోక పోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి అవస్థలు పడుతున్నామని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

రామడుగు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 85వ బూత్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బూత్ అధ్యక్షుడు రాగం కనకయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పార్టీ సభ్యత్వ నమోదు జిల్లా జాయింట్ కో ఆర్డినేటర్ జాడి బాల్‌రెడ్డి హాజరై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో మండల సోషల్ మీడియా కన్వీనర్ మాడిశెట్టి జయంత్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్పించిన పోలీసులు

రామడుగు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదిర గ్రామానికి చెందిన కుమ్మరి దర్గమ్మ అనే వృద్ధురాలిని పోలీసులు అనాథ ఆశ్రమంలో చేర్పించారు. తనకు చేయూతనం దించాలని శనివారం దర్గమ్మ పోలీసులను ఆశ్రయించింది. తనకు ముగ్గురు కూతుళ్ళ, కొడుకు ఉన్నారని దుర్గమ్మ తెలిపింది. కొడుకు నాలుగేళ్ల క్రితం మృతి చెందడంతో తనను పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఎస్సై శేఖర్ దుర్గమ్మను ఆశ్రమంలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు.

ఘనంగా బల్మూరి వెంకట్ జన్మదిన వేడుకలు

హుజూరాబాద్/జమ్మికుంట/వీణవంక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కసుబోజుల వెంకన్న ఆధ్వర్యంలో కేకు కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్ ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తాలో బాణాసంచా కాల్చారు. వీణవంకలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర


వెన్కేపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొత్త తిరుపతిరెడ్డి

సైదాపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి అన్నారు. వెన్కేపల్లిలో ధాన్య కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి, శుభ్రం చేసి కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రవిందర్, సీఈవో శ్రీధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధ్వంసమైన కాలువ రోలింగ్

- రెండేళ్లుగా మరమ్మతులు చేపట్టని అధికారులు


దెబ్బతిన్న కాలువ రోలింగ్

చొప్పదండి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ నుంచి కాట్నపల్లి వెళ్లే దారిలో కాకతీయ కాలువ బ్రిడ్జి రోలింగ్ ధ్వంసమై రెండేళ్ల గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. గతంలో బైక్ అదుపు తప్పి రోలింగ్‌ను ఢీకొట్టగా ధ్వంసమైపోయింది. రుక్మాపూర్ మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయానికి చెందిన విద్యార్థులు, కాట్నపల్లి, రుద్రారం గ్రామాలకు ప్రజలు ఈ రహదారి మీదుగా రాక పోకలు సాగిస్తుంటారు. ఆటోలు, బస్, బైక్‌లతో పాటు కాలినడకన విద్యార్థులు వెళ్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఇల్లందకుంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించే మాలల ఆత్మీయ గౌరవ సమ్మేళనం కరపత్రాలను మాలల సంఘం రాష్ట్ర నాయకుడు మాదాసు మొగిలి శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న మాలల ఆత్మగౌరవ సభకు ఎమ్మెల్యేలు వివేక్, మేడిపల్లి సత్యం, నాగరాజుతో మల్లెపల్లి లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే సుద్దాల దేవయ్య హాజరవుతారని చెప్పారు. మాలలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో దిలీప్, రవీందర్, అంజయ్య పాల్గొన్నారు.

మైలారం రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

గన్నేరువరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి మైలారం గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారడంతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు తాత్కాలిక మరమ్మతు పనులను స్థానిక కాంగ్రెస్ నాయకుడు దుడ్డు మల్లేశం ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. రోడ్డుపై గుంతలు పడడంతో ఆర్టీసీ బస్సు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పదిరోజులుగా గ్రామానికి బస్సు సౌకర్యం నిలిచిపోయింది. స్థానిక నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తాత్కాలిక మరమ్మతులకు ఆదేశించడంతో స్థానిక నాయకులు పనులు ప్రారంభించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పెంచిన మెస్ చార్జీలతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన జీవో ద్వారా మూడు నుంచి ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులకు 950 నుంచి 1,330 రూపాయలు అందనుందని తెలిపారు. ఎనిమిది నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 1,100 నుంచి 1,540, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు 1,500 నుంచి 2,100 రూపాయలు అందుతాయని పేర్కొన్నారు. మెస్ చార్జీలతో పాటు కాస్మోటిక్ చార్జీల పెంపుతో పేద విద్యార్థులకు ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు.

'చలో హైదరాబాద్'కు తరలిరావాలి

గంగాధర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిలుల చెల్లించాలని తాజా మాజీ సర్పంచ్‌లు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలని గంగాధర సర్పంచ్‌ల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు శ్రీమల్ల మేఘరాజు కోరారు. గంగాధరలో శనివారం ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులు చేపట్టిన తమకు పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ సోమవారం హైదరాబాద్ పోరుబాట కార్యక్రమం తలపెట్టిందన్నారు. హైదరాబాద్‌లోని బంజారహిల్స్ పెద్దమ్మతల్లిగుడి వద్ద నిర్వహించే కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

గన్నేరువరానికి ఆర్టీసీ బస్సు సేవలు

- ప్రారంభించిన డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు


మాధాపూర్‌లో బస్సును ప్రారంభిస్తున్న కొమ్మెర రవిందర్‌రెడ్డి

గన్నేరువరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి గుండ్లపల్లి మీదుగా గన్నేరువరం ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు శనివారం మాధాపూర్ వద్ద డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవిందర్‌రెడ్డి గ్రామస్థులతో కలిసి ప్రారంభించారు. ఇటీవల కొమ్మెర రవిందర్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వారి సూచనల మేరకు ఆర్టీసీ యాజమాన్యం గుండ్లపల్లి మీదుగా శనివారం బస్సును ప్రారంభించింది. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు మార్గం మల్లేశం, బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్, నాయకులు కల్లెం మల్లారెడ్డి, కుమ్మరి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

భవనం పనుల పరిశీలన

సైదాపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విశాల సహకార పరపతి సంఘం భవనంతో పాటు సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం పనులు పూర్తి నాణ్యతతో చేపట్టాలన్నారు. ఫంక్షన్ హాల్ రైతులకు ఉపయోగపడే విదంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఫంక్షన్ హాల్‌లో అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. సొసైటీ సీఈవో శ్రీధర్‌కు, సిబ్బందికి సూచన లు చేశారు.. సొసైటీ ద్వారా రైతులకు అవసరమైన సేవలు అందించడంలో జాప్యం కాకుండా చేసుకోవాలని చెప్పారు. సేవలను సమయానుకూలంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీఈవో భిక్షపతి, సిబ్బంది పాల్గొన్నారు.

భోజనంలో మెనూ పాటించాలి

గంగాధర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు భోజనంలో మెనూ పాటించాలని ఎంపీవో జనార్దన్‌రెడ్డి అన్నారు. గంగాధర మోడల్ స్కూల్‌లో శనివారం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. భోజనం రుచికరంగా తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో శ్రీలక్ష్మి ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

రామడుగు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నలువాల వంశీధర్‌రెడ్డి స్మారక క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. చొప్పదండి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి 50 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ చాడ ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారుడు తోట కృష్ణ, వాగ్దేవి డిగ్రీ కళాశాల డైరెక్టర్ పూరేళ్ల శేఖర్, రాగం కనకరాజు, మాదం చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో తిరుపతి, మనోజ్, లక్ష్మణ్, సురేందర్ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం

రామడుగు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంను శనివారం జిల్లా కేంద్రంలో పలువురు మండల నాయకులు కలుసుకుని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు మక్బుల్‌దీన్, రామడుగు మండల నాయకులు కాడే శంకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్‌స్టవ్ వితరణ

జమ్మికుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన స్పందన అనాథ శరణాలయానికి శనివారం సత్యసాయి సేవ సమితి సభ్యులు రూ.2,500 విలువ గల గ్యాస్‌స్టవ్‌ను అందజేశారు. సభ్యులకు శరణాలయం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా

గన్నేరువరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో శనివారం మండల పశువైద్యాధికారి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 300 ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేశారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారి అభిషేక్ రెడ్డి, లైవ్ స్టాక్ అసిస్టెంట్ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.